అనుమానం :

# ఆవిడ ఎవరంటారా?

★

అలవాటుప్రకారం సాయంకాలం గోదావరి గట్టుకు వెళ్లేను. ఆలస్యంగా బయలుదేరడం మూలాన ఊరికి దగ్గరలోనే వున్న నీళ్లరేవుకు కొద్ది దూరంలో ఒక ఎండిన మోడుమీద కూర్చున్నా.

సూర్యుడు అస్తమించాడు. చల్లటిగాలి వీస్తోంది. పైగా పిండారబోసినట్లు వెన్నెల. ఆ వాతావరణాన్ని విడిచిపోవటానికి మనస్కరించక చంద్రకిరణాలు రేవులోని నీళ్ళమీద పడి చేస్తూన్న అల్లరిని చూస్తూ అలాగే కూర్చుండిపోయా.

చంద్రుణ్ణి ఒక మబ్బు కప్పింది.

"ఎవరండీ వారు!" ఒక శబ్దం.

నేను ఉలిక్కిపడ్డాను.

తిరిగి అటునుంచి అదే ప్రశ్న.

"నేనే" అన్నా అప్రయత్నంగా.

"నేనే అంటే?"

ఏమిటీ క్రాస్ ఎగామినేషన్.

కొద్దికోపంతో "నేను అంటే నేనే. మీ కెదురుగా వున్న ఒక పెద్దమనిషిని" అన్నాను నేను.

"ఇదేనటయ్యా పెద్దమనిషి తరహా. ఇందాకటి నుంచీ నీళ్ళకొచ్చిన ఆ మనిషిని అదేపనిగా చూడడం పెద్దమనుషుల లక్షణమటయ్యా" అన్నాడతను రేవులో నీళ్లు ముంచుకుని మెట్లెక్కుతూన్న ఒక స్త్రీని చూపిస్తూ.

నేను కంగారుపడ్డాను.

"అబ్బే, ఇందాకటినుంచీ నేను ఆమె వంకే చూడలేదే" అన్నా ఈమారు ఆ స్త్రీని బాగా పరకాయించి చూస్తూ.

"అబద్ధాలెందుకయ్యా ఆడతావ్. నేను ఆ మనిషి నీళ్ళకు వచ్చినదగ్గరనుంచీ చూస్తున్నాను. నీవు దానికేసి అదేపనిగా చూడడం, అది నీవు చూస్తున్నావుగదా అని మరింత ఒయ్యారంగా నీళ్లు ముంచడం, నేనేం కళ్ళు లేనివాడ ననుకున్నావా?" అన్నాడు ఒక్కగుక్కలో.

ఆ కళ్ళున్న మనిషి ముఖాన్ని పరకాయించి చూశాను. సరిగ్గా ఆ సమయానికే కొంటె మబ్బు తెరల మధ్యకు వచ్చాడు శశాంకుడు. ఎవరీ మనిషి?

ఓహో, ఈయనా!!

చంద్రుడు మళ్ళీ మబ్బుచాటుకు వెళ్లిపోయాడు. ఈ విచిత్ర సంఘటన చూసేసరికి నాకు నవ్వాగలేదు. నల్లటి ఆకారం, యాభైఏళ్ల వయస్సు, పాత సులోచనాలు, ముతక ఖద్దరుపంచె, అదేరకం బనియన్. అంటుకతెర క్రాపింగ్. ఇంకెవరు? మా గుమస్తా శాస్త్రిజీ. నామీద ఆయన ఎందుకు మండిపడుతున్నాడో ఇప్పుడర్థమైంది.

ప్రక్కనున్న చెట్టునీడ నామీద పడుతూండడం మూలాన నేను ఆయన్ను గుర్తించినా, నన్నాయన గుర్తుపట్టలేకపోయాడు. ఈ ప్రహసనాన్ని ఇంకొంతసేపు సాగిద్దామనే వుద్దేశంతో కొద్దిగా నవ్వుతూ "ఎందుకండీ అంత కోపం. అసలు విషయమేమిటో చెప్పండి" అన్నా.

ఈ నా శాంతంతో ఆయన నన్నొక పెద్ద మనిషిగానే భావించాడనుకుంటాను. ఒకసారి రేవువైపు చూశాడు. ఇందాకటి మనిషి గట్టుదిగి ఊళ్ళోకి వెళ్ళిపోతోంది.

శాస్త్రిజీ నాకొక గజంన్నరదూరంలో నిమ్మదిగా కూర్చున్నాడు.

"అయితే బాబూ ఆ మనిషిని ఇదివరకెప్పుడూ తమరు చూడనేలేదా" అన్నాడు శాస్త్రిజీ నెమ్మదిగా.

"ఆవిడ ఎవరి తాలూకో తెలియదుకాని ప్రతిరోజూ ఆవిడ నీళ్ళకు రావడంమటుకు చూస్తుంటానండి" అన్నాను నేను.

"అయితే తమరు ప్రతిరోజూ ఈ సమయానికి ఇక్కడ చేరుకుంటారన్నమాట."

"ఇక్కడ కూర్చోనులెండి. అలా లాకుల వరకూ వెళ్తూంటాను. ఇవాళ మటుకు అలా వెళ్లాలని లేక ఇక్కడే కూర్చున్నా."

శాస్త్రిజీ కొద్దిగా శాటిస్ఫై అయినట్టు కన్పించాడు.

"ప్రతిరోజూ చూస్తున్నానన్నారుగదా. ఆ మనిషి ఎలాంటిదంటారు" అన్నాడు కొద్దిగా జరిగి.

"ఆ విషయం తెలిసికోవలసిన అవసరం నాకేమిటండీ."

"ఆహా. మనలో మాట."

ఎ. రంగనాథ రావు

"ఏం. బాగానే వుంటుంది" అన్నా అమాయికాన్ని నటిస్తూ.

"రూపం కాదండీ. గుణంమాట నే నడిగేది. గుణం" అన్నాడు విసుగుదలతో.

"నే నెరిగినంతవరకూ ఆవిడ గుణంలో చెడ్డతనం నాకేమీ కన్పించలేదండీ. ఎవరైనా మగవాళ్లొస్తే కొదిగా తప్పుకొని వెళ్లడం, కేవలం ఆడవాళ్ళతోనే మాత్రం మాటాడడం వగైరాలు చూస్తుంటే ఆవిడ సాధ్వీరత్నంలా కన్పిస్తున్నదండీ" అన్నా కాస్త దీర్ఘం తీస్తూ.

చతికిలబడి కూర్చున్న శాస్త్రుల్లు గభాలున కాళ్ళమీద కూర్చున్నాడు. "నిజమేనా బాబూ, నిజమేనా" అన్నాడు కొండెక్కినంత సంతోషంతో.

"అహా. నేను అబద్ధం ఎందుకు చెబుతానండీ" అన్నా.

"బాబూ మిమ్మల్ని మొదట ఎవరో కాడీ ముండాకొడుకనుకుని ఏమేమో అన్నాను. ఏమీ అనుకోకండి" అన్నాడు ప్రాధేయపూర్వకంగా.

"అబ్బే ఏమీ అనుకోవటంలేదులెండి" అంటూ నేను లేచాను ఇంటికి పోదామని.

శాస్త్రికూడా నా వెనకనే వస్తున్నాడు.

రోడ్డువరకూ వచ్చాం.

"అయితే బాబూ తమరు ఎవరో సెలవిచ్చారు కారు" అన్నాడు శాస్త్రి.

ఇద్దరం ఇప్పుడొక ఎలక్ట్రిక్ లైటు క్రిందకు వచ్చాం.

"నన్నెప్పుడూ చూడలేదా శాస్త్రిగారూ" అన్నాను వెనక్కి తిరిగి ఆయన ముఖంలోకి చూస్తూ.

"మేనేజరు బాబుగారా!" అన్నాడు శాస్త్రీజీ ఆశ్చర్యంతో.

పాపం. మనిషి కొయ్యలా నిలబడిపోయాడు.

"నేను వెళ్లివస్తానండీ శాస్త్రిగారూ" అంటూ నాలో నేను నవ్వుకుంటూ ముందుకు దారితీశాను. ఒక ఫర్లాంగుదూరం వెళ్లేక వెనక్కి తిరిగిచూశా. పాపం మా శాస్త్రి ఇంకా అప్పటికీ దీపంక్రిందే స్తంభించివున్నాడు.

ఇంతకీ ఆవిడ ఎవరంటారా?

ఆవిడ మా శాస్త్రీజీ ఒక సంవత్సరం క్రితం మాత్రమే వివాహమాడిన ముద్దుల, అనుమానపు మూడో భార్య !!!

కలికాలం :

# కాంగ్రెస్ న్యాయాలు

డాక్టరు శతపధి

ఇండియా యునైటెడ్ మిల్సువారు 31-12-46 సంవత్సరంతో అంతమయ్యే వార్షిక నివేదికలో ధర్మఖులక్రింద వెచ్చించిన 1,43,702 రూపాయలలో రు 1,25,000 లు పటేలుగారి కొసంగినటుల తెలియపర్చినారు. ఆ మొత్తము కాంగ్రెస్ కివ్వకపోయినా. స్వంతానికి స్వాహా చేసినప్పటికీ, ఆయన మహాత్ముని దృష్టిలో నిసలైన కాంగ్రెస్ మహానాయకుడు.

... ... ...

కలకత్తా పౌరులు సురేష్‌చంద్రముజుందార్ గారిచేత, కలకత్తా దేశబంధు పార్కులో 1946 జనవరిలో శరశ్చంద్రబోసుకు బహుమతిగా యిచ్చిన రు 1,11,101లు స్వంతానికుపయోగించుకొనినా, కేంద్రప్రభుత్వ సభ్యత్వమును ప్రసాదించినది కాంగ్రెస్. ఆయన చేసినది తప్పుకాదు.

... ... ...

కాంగ్రెస్ అధ్యక్షుడు ఆచార్యకృపాలినీ కొచ్చిన్ మహారాజా చేతినుండి గైకొనని ముప్పదివేలు, కాశ్మీర్ మహారాజా క్విట్ కాశ్మీర్. ఉద్యమము ఘోరన్యాయమని ప్రకటించినందుకు పరిహారముగా నిచ్చిన పాతికవేల రూపాయలు స్వంతానికి వాడుకొనినా, ఆయన కాంగ్రెస్ అధ్యక్షుడు-మహాత్ముని దృష్టిలో.

... ... ...

తన వాచీ పోగా, బ్రిటీష్ కంపెనీవారుచితముగా నిచ్చిన వాచీ భుక్త పర్చుకొనుట గాంధీజీకి న్యాయసమ్మతమైనది, ధర్మబద్ధమైనదికానీ—

... ... ...

ఆంధ్రకేసరి ప్రకాశం పంతులుగారికి భక్తిశ్రద్ధలతో ఆంధ్రప్రజానీకము స్వంత ఉపయోగానికై యిచ్చిన రు 62,000లు కాంగ్రెస్‌కు దఖలు పర్చకపోవడం ఘోరమైన అన్యాయం.